సాక్షి
గుంటూరు

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



జగనన్న కానుకల పరిశీలన

రొంపిచర్ల: మండల కేంద్రంలో భద్రపర్చిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం రాష్ట్ర పరిశీలకులు, జాయింట్ డైరెక్టర్ మేరీచంద్రిక పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4,700 వరకు పలికింది.

మరో ఐదు కేసులు



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఐదు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు ఏటీ అగ్రహారం, సంపత్‌నగర్‌లో ఒక్కొక్కటీ చొప్పున, ఇన్నర్‌రింగ్ రోడ్డులో మూడు కేసులొచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6:28	4:35
నరసరావుపేట	6:30	4:32
బాపట్ల	6:28	4:35

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన బాపట్ల జిల్లా కలెక్టర్




బాపట్ల: జిల్లా నూతన కలెక్టర్‌గా పి.రంజిత్ బాషా పదవీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం మూడుగంటలకు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై బాపట్ల జిల్లా కలెక్టర్‌గా వచ్చారు. నూతనంగా బదిలీపై వచ్చిన పి.రంజిత్ బాషాను జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, మత్స్య శాఖ జె.డి సురేష్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, రెవెన్యూ డివిజనల్ అధికారులు రవీంద్ర, సరోజిని, పార్థసారథి, తహసీల్దార్లు కలసి పూలమాలలతో అభినందించారు.

జీవితంలో ఎదిగేందుకు అవకాశాలను శోధించాలి



గుంటూరు లీగల్: జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు గల అవకాశాల్ని ప్రతి ఒక్కరూ శోధించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి జీబీఏ అధ్యక్షుడు కె.వి.కె.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కె.మన్మథరావు మాట్లాడుతూ సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు ఎప్పుడూ సంసిద్ధులై ఉంటారని, తదనుగుణంగా న్యాయవాదులు కూడా సహకరించాలని కోరారు. సకాలంలో అందని న్యాయం అన్యాయమే అవుతుందని తెలిపారు. కందుకూరులో ఒక గ్రామీణ ప్రాంత కోర్టు నుంచి హైకోర్టు వరకు జరిగిన తన వ్యక్తిగత ప్రస్థానాన్ని వివరించారు. అంబేడ్కర్ తన జీవితంలో జరిగిన ఎన్నో అవమానాల్ని సవాలుగా స్వీకరించి అసమానతలను అధిగమించారని తెలిపారు. కార్యక్రమాన్ని బార్ కోశాధికారి జి.విజయరాజ్ కుమార్ నిర్వహించారు. జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి వి.ఎ.ఎల్.సత్యవతి, నాలుగో అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, జూనియర్ సివిల్ జడ్జిలు, జీబీఏ మాజీ అధ్యక్షులు జి.శాంత కుమార్, నట్టువ సత్యనారాయణ, జీబీఏ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.వంశీకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పశ్చిమకు 416 క్యూసెక్కులు



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో బ్యాంక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 258 క్యూసెక్కులు,, నిజాంపట్నం కాలువకు 110 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 526.60 అడుగుల వద్ద ఉంది. ఇది 161.5866 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,707, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,533,ఎస్ఎల్‌బీసీకి 1,772, వరద కాలువకి 225 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 10,746 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 4,128 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.4403 టీఎంసీలకు సమానం.

స్ఫూర్తి మూర్తికి సలాం



విజ్ఞానమందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, చిత్రంలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు చంద్రగిరి, జంగా, అప్పిరెడ్డి, మేయర్ మనోహర్ నాయుడు, కలెక్టర్ తదితరులు

- అంబేడ్కర్ ఆశయాల మార్గంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- మంత్రి మేరుగ నాగార్జున
- లాడ్జిసెంటర్‌కు అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం

నెహ్రూనగర్: భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశం, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కారణంగా ప్రపంచంలోనే అదిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లుతున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున వెల్లడించారు. భారతరత్న, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు గుంటూరులో ఘనంగా జరిగాయి. ముందుగా లాడ్జిసెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణాన్ని ఆధునీకరించిన నేపథ్యంలో ఆ సెంటర్‌కు అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపించిన బాట అందరికీ ఆదర్శనీయమ న్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, జంగా కృష్ణ మూర్తి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ శామ్యూల్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, వికలాంగుల, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, మిర్చియార్డు చైర్మన్ సుధాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పాత గుంటూరు: ప్రపంచానికి ఆదర్శప్రాయుడు భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

భారతజాతి ఆత్మ గౌరవం బీఆర్ అంబేడ్కర్

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగ రూపకల్పనతో భారతదేశ ప్రజాస్వామ్యం పరిఢవిల్లే విధంగా చేసిన బీఆర్ అంబేడ్కర్ భారతజాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ దేశం గర్వించదగిన రాజ్యాంగం రచించిన గొప్ప వ్యక్తిగా, రాజ్యాంగంలో మహిళలకు చట్టబద్ధత కలుగ చేసి, ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించిన ఏకైక వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జె. మోహన్‌రావు, వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, రాష్ట్ర పంచా యతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఏవోలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఐజీ పాలరాజ్

- మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- రేంజ్‌లో మంచి పోలీసింగ్‌ను నిర్వహిస్తాం
- సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం
- విలేకరుల సమావేశంలో వెల్లడి



నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీగా జి. పాలరాజ్ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు నగరం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఐజీ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో ఏలూరు రేంజ్ ఐజీగా విధులు నిర్వహిస్తున్న పాలరాజ్‌ను గుంటూరు రేంజ్ ఐజీగా బదిలీ చేసిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఐజీ బాధ్యతలు అప్పగించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా విజిలెన్స్‌లో, డీజీపీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ సరీ్వసెస్, దిశలో విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. గుంటూరు రేంజ్‌పై పూర్తిగా అవగాహన ఉందన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని విధాలుగా చర్యలు చేపడతామని చెప్పారు. అదే విధంగా మహిళలపై నేరాలు జరగకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

2021 నరసరావుపేటలో డిగ్రీ విద్యార్థిని అనూష హత్య కేసులో సహ విద్యార్థికి జీవితఖైదు, బీటెక్ విద్యార్థినీ రమ్య హత్య కేసులో నిందితుడికి ఉరి శిక్ష విధించారని ఐజీ గుర్తుచేశారు. రాష్ట్రంలోని పలువురు పోలీస్ ఉన్నతాధికారులకు ముఖ్యమైన కేసులను అప్పగించారని అన్నారు. అందులో రాష్ట్ర వ్యాప్తంగా 120 కేసులను అప్పగించగా, 68 కేసుల్లో నిందితులకు శిక్షలు పడినట్లు చెప్పారు. పలు కేసుల్లో నిందితులకు శిక్షలు విధించడం వల్ల సమాజంలో మార్పు తథ్యమని అన్నారు. గ్రామాల్లోని మహిళలకు నేరాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ప్రత్యేక కృషి చేస్తామన్నారు. నేరాలకు పాల్పడే వారికి శిక్షలు పడే విధంగా పోలీస్ పనిచేస్తుందని చెప్పారు. రేంజ్ పరిధిలో మంచి పోలీసింగ్‌ను నిర్వహించి, సత్ఫలితాలు సాధిస్తామన్నారు. సైబర్ నేరాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని, నేరం జరిగిన వెంటనే సమగ్రంగా వివరాలు తెలుసుకున్నట్లయితే 90 శాతం నేరాలు చేధించవచ్చునన్నారు.

సైబర్ క్రైం టోల్‌ఫ్రీం నంబర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. నేరాలు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. ఉన్నతంగా చదువుకున్న కొందరు బయటకొచ్చి సైబర్ నేరగాళ్లగా అవతారం ఎత్తుతున్నారని చెప్పారు. పలురకాల లింక్‌లతో డబ్బులు గుంజేసుకుంటున్నారన్నారు. అర్బన్ పరిధిలోనే 70 శాతం మంది సైబర్ నేరాల బారినపడుతున్నారని, వీటిన్నింటిపై రానున్న రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐజీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఐజీని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికాఖర్గే, గుంటూరు ఏఎస్పీలు అనీల్‌కుమార్ (ఎల్అండ్ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), రేంజ్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు.

అంబేడ్కర్ బాటలో సీఎం వై.ఎస్.జగన్

- ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- పొన్నూరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో డాక్టర్ కత్తి పద్మారావు, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కిలారి

చేబ్రోలు: ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన అంబేడ్కర్ ఆశయాలు కనుగుణంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలతో బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పొన్నూరు పట్టణం 23 వార్డులోని అంబేడ్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ పార్కు, గ్రంథాలయం, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి పొన్నూరు పురపాలక సంఘం కమిషనర్ ఎం. రాధారెడ్డి అధ్యక్షత వహించారు. ఉమ్మారెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల్ని పుణికి పుచ్చుకున్న ముఖ్యమంత్రి సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని సామాజిక న్యాయం పాటిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ భారతదేశంలో కుల, మత నిర్మూలన జరగాలని ఎలుగెత్తి చాటిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజలకు అంబేడ్కర్ వెలుగు రేఖగా పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ కత్తి పద్మారావు రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర 700 పేజీల పుస్తకాన్ని డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అంబేడ్కర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కు, గ్రంథాలయాన్ని అతిథులు డాక్టర్ కత్తి పద్మారావు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కిలారి వెంకట రోశయ్యలు ప్రారంభించారు.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయానికి ఉమ్మారెడ్డి రూ.లక్ష, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య లక్ష రూపాయలతో పాటు మరి కొంతమంది విరాళం ప్రకటించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఏపీ మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, దాసరి నారాయణరావు, భవనం వంశీరెడ్డి, బొద్దులూరి రంగారావు, ఎం. అనీలా కుమారి, షేక్ షబ్బీర్, గూడవల్లి గంగాధర్, దళిత మహాసభ జిల్లా కన్వీనర్ అక్కిదాసు జాషువా పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాత ఆలోచనలతోనే ప్రగతి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తదితరులు

పట్నంబజారు: అంబేడ్కర్ ఆలోచన విస్ఫోటనాలే దేశ విజయ శిఖరాలకు కీలకమయ్యాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జగనన్న నవోత్సవాల్లో భాగంగా 'అంబేడ్కర్ ఆలోచనలు- జగనన్న ఆచరణలు' అనే అంశంపై సమాశం నిర్వహించారు. సమావేశానికి పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. తొలుత అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునే రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్, మనం ఆచరించేందుకు ఎన్నో మంచి మార్గాల్ని చూపించారని తెలిపారు. స్త్రీ, పురుష సమానత్వం చాటిచెప్పడంతో పాటు, ప్రతి వ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేసేలా ఆయన జీవితం ఉందని చెప్పారు. వ్యవసాయాన్ని ఇండస్ట్రీ కింద చూడాలని ఇప్పుడు పోరాటాలు చేస్తున్నారని, 70 ఏళ్ల కిందటే ఆ మాటను ఆయన చెప్పారన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ''టెక్స్ ఆఫ్ ధర్మ''గా కీర్తించిన ఘనత ఉందన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలన్ని పుణికిపుచ్చుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. చదువు ద్వారానే జీవితం గొప్పగా ఉంటుందని చెప్పిన అంబేడ్కర్ మాటలను ఆదర్శంగా తీసుకుని, నాడు-నేడు, అమ్మ ఒడి, వైఎస్సార్ విద్యాదీవెన, వసతి దీవెన వంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ముందుగా లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపక విభాగం రాష్ట్ర నేత మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు డాక్టర్ వై. షేక్, మేడా వెంకటేశ్వరరావు, మాదా రాధాకృష్ణ మూర్తి, సీడీ భగవాన్, కళ్లం హరికృష్ణారెడ్డి, ఓంప్రకాష్‌రెడ్డి, మురళి, ఫిరంగిపురం ఎంపీపీ నర్గీస్, అత్తోట జోసఫ్, బిజేనపల్లి శరత్, తిప్పారెడ్డి రామకృష్ణారెడ్డి, గనిక ఝాన్సీ, జన్నత్, పాల్గొన్నారు.

ఇంత'కన్నా' దారుణం ఉంటుందా?

- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీడీపీ నేత దౌర్జన్యం
- గుంటూరులో హడావుడి



కిషోర్‌ను తోసేస్తూ ముందుకు వెళ్తున్న కన్నా, అనుచరులు

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీడీపీ నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అత్యుత్సాహం ప్రదర్శించారు. లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆధునీకరించి దానికి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేసి ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని కుల, దళిత సంఘాల నాయకులతో, అన్ని పార్టీ నాయకులను కలుపుకుంటూ శుక్రవారం ఉదయం 9 గంటలకు అధికారికంగా షెడ్యూల్ ప్రకటించారు. దీనికి సంబంధించి గురువారం సాయంత్రమే సమాచారం అందరికీ చేరవేసింది. అయితే టీడీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ నిర్ణయించిన షెడ్యూల్ కన్నా ముందే వచ్చి ప్రొటోకాల్‌ను కాదని అంబేడ్కర్ విగ్రహానికి దండ వేస్తానని, తన అనుచరులతో కలిసి విగ్రహం వద్ద దౌర్జనం చేయసాగారు. దీన్ని ఖండిస్తూ దళిత కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి భర్త వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కిషోర్ జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జునలు ఉదయం 9 గంటలకు అధికారికంగా వచ్చి అంబేడ్కర్ సర్కిల్‌గా నామకరణం చేసి ప్రారంభిస్తారని, ఆ తరువాత దండ వేయాలని సూచించినప్పటికీ దౌర్జన్యంగా తోసుకుంటూ వెళ్లడంతో పాటు దూషిస్తూ, దాడి చేయడానికి యత్నించి భయభ్రాంతులకు గురిచేసి మరి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేశారు. మాజీ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి అయి ఉండి కన్నా లక్ష్మీనారాయణ ప్రోటోకాల్ పాటించకుండా దళిత నాయకుడిని తోసేసి, దాడి చేసేందుకు ప్రయత్నించడాన్ని ఖండిస్తూ స్థానిక అరండల్‌పేటలో పోలీస్ స్టేషన్‌లో దళిత, గిరిజన కార్పొరేటర్లు కన్నాపై ఫిర్యాదు చేశారు.

దళిత కార్పొరేటర్ భర్తకు క్షమాపణ చెప్పాలి

దళిత కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి భర్త కిషోర్‌పై టీడీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ విచక్షణ కోల్పోయి దాడికి యత్నించి అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయడం చాలా బాధాకరమైన విషయమని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు.

ఆరోగ్యం ఎలా ఉంది?

ముమ్మరంగా ఫీవర్ సర్వే

- జిల్లా వ్యాప్తంగా 93 శాతం సర్వే పూర్తి
- కోవిడ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా వైద్యశాఖ అప్రమత్తం
- కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



పరిమి గ్రామంలో కోవిడ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: కొద్దిరోజులుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఎక్కువగా నమోదవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. నూతనంగా విధుల్లో చేరిన వైద్యులు, వైద్య సిబ్బందికి సైతం కరోనా పాజిటివ్ నిర్ధారణ పరీక్షలు ఏవిధంగా చేయాలి, శాంపిల్ ఏవిధంగా సేకరించాలి, బాధితులకు ఏవిధంగా చికిత్స అందించాలనే విషయాలపై పూర్తి స్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి వాటిపై ఆరాతీస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 49వ ఫీవర్ సర్వేలో ఎవరికైనా కరోనా పాజిటివ్ రిపోర్ట్ వస్తే తక్షణమే వారికి హోమ్ ఐసోలేషన్ కిట్స్ అందజేసి ఇంట్లోనే చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

93 శాతం సర్వే పూర్తి

జిల్లా వ్యాప్తంగా 7,16,253 ఇళ్లు ఉన్నాయి. వలంటీర్, ఆశ, ఏఎన్ఎం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,54,209 ఇళ్లు ఫీవర్ సర్వే పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 93 శాతం సర్వే పూర్తవడంతో వీరిలో 897 మందికి జ్వరపీడిత లక్షణాలు ఉన్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు.

వారికి కోవిడ్ సోకిందా, సాధారణ జ్వరమా అనే అనుమానాలు నివృత్తి చేసి ఇళ్ల వద్ద, సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో యాంటిజన్ టెస్ట్‌లు చేస్తున్నారు. యాంటిజన్ టెస్ట్‌ల్లో కోవిడ్ పాజిటివ్ వస్తే ఖచ్చితమైన నిర్ధారణ కోసం ఆర్టీపీసీఆర్ పరీక్ష చేసి నిర్ధారిస్తున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో ఆర్టీపీసీఆర్ టెస్టులు, హోల్ జీనోమ్ సీక్వెన్సింగ్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి.

కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలి

కొద్దిరోజులుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కోవిడ్ పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ వైద్య సిబ్బంది వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నారు. జ్వరం, దగ్గు, జలుబు గొంతునొప్పి, తలనొప్పి వంటి లక్షణాలు ఉన్నవారని ఫీవర్ సర్వేలో గుర్తిస్తే తక్షణమే వారికి ఇంటివద్దే చికిత్స పొందేలా హోం ఐసోలేషన్ మెడికల్ కిట్స్ అందిస్తున్నారు. హోం ఐసోలేషన్‌లో ఉన్నవారి ఆరోగ్య పరిస్థితిపై ప్రతి రోజూ వైద్యులు, వైద్య సిబ్బంది ఆరా తీస్తున్నారు. ఇళ్ల వద్ద చికిత్స పొందేందుకు ఏమైనా సందేహాలు, అనుమానాలు ఉన్న వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాం. ఏమైనా క్రిటికల్ కేసులు కనిపిస్తే వాటికి చికిత్స అందించేందుకు గుంటూరు జీజీహెచ్‌తోపాటుగా పలు ఆసుపత్రుల్లో కోవిడ్ మాక్ డ్రిల్ నిర్వహించి వెంటిలేటర్లు, మందులు, ఆక్సిజన్ సరఫరా, ప్రత్యేక ఐసీయూ, అన్ని సిద్ధం చేసి ఉంచాం.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గుంటూరు వెస్ట్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది వైద్య పరీక్షలు, ఆరోగ్య పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. శని, ఆదివారాలు నిర్వహించనున్న మెగా మెడికల్ క్యాంపునకు సంబంధించి స్థానిక కలెక్టరేట్ ఆవరణతో పాటు శంకరన్ సమావేశ మందిరంలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు ఏర్పాట్లు పరిశీలించారు.
కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేటప్పుడు ఎంత క్రమ శిక్షణతో ఉంటారో, ఆరోగ్యం, కుటుంబ బాధ్యతల్లో కూడా అదే విధంగా ఉండాలన్నారు. ఒక వ్యక్తిపై ఆధారపడి ఒక కుటుంబం ఉంటుందన్న సత్యాన్ని మరువకూడదని చెప్పారు. గుంటూరులోని ప్రముఖ ఆసుపత్రులైన లలిత సూపర్ స్పెషాలిటీ, మణిపాల్, శ్రీ హాస్పిటల్, ఆదిత్య, అగర్వాల్ కంటి ఆస్పత్రి, ప్రత్యూష డెంటల్ తదితర ఆసుపత్రులకు చెందిన వైద్యులు హాజరవుతారన్నారు. మొత్తం 17 రకాల టెస్టులు నిర్వహిస్తారని చెప్పారు. దాదాపు ఆసుపత్రుల్లో లభించే వైద్య పరికరాలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు.

27 బైక్‌ల స్వాధీనం

అమరావతి: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో సమస్యాత్మక గ్రామాలలో విస్తృత తనిఖీలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేకువజామున మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సుమారు మూడు గంటలపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామి, 11మంది ఎస్‌ఐలు మరో యాభైమంది సిబ్బందితో కలిసి నరుకుళ్లపాడు గ్రామాన్ని ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ రికార్డులు, పత్రాలు సరిగా లేని 27ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి నాగార్జున, అగ్నిమాపక శాఖ అధికారులు

పట్నంబజారు: అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. శుక్రవారం నుంచి అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో ఇన్నర్ రింగ్‌రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ అగ్నిప్రమాదాలతో పాటు అనేక విపత్తుల్లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో అసువులు బాసిన సిబ్బందికి సంతాప సూచికంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో రీజనల్ అగ్నిమాపక అధికారి ఎంఏ జిలాని, జిల్లా అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, సహాయ జిల్లా అధికారి ఎస్.పార్థసారథి, అధికారులు పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ


జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణ మాదిగ

తెనాలి అర్బన్: బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించకపోవడం బాధకరమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు ప్రముఖ న్యాయవాది ఇందుపల్లి రాజారాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ కృషి ఫలితంగా ఈ రోజు రిజర్వేషన్లు అనుభవిస్తున్నామని గుర్తు చేశారు. అంతేకాకుండా 1950 నుంచి ప్రతి పది సంవత్సరాలకు రిజర్వేషన్లను పొడిగించే విషయంలో ఆయన ఎంతో చొరవ చూపారని చెప్పారు. కొంత మంది కుట్రఫలితంగా ఆయన భారతదేశానికి అందించిన సేవలు మరుగున పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతరత్న ఇచ్చే వరకు పోరాట చేస్తామని ప్రకటించారు. అలాగే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధనకు త్వరలో కార్యచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీలు ఉపకులాల నాయకులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే సుప్రీం కోర్టులో ఉన్న రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై కూడా న్యాయనిపుణులను సంప్రదించి కోర్టు నుంచి సానుకూల తీర్పు వచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ఏపీపీలు సుద్దపల్లి సుకుమార్, పరిశపోగు సునీల్, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి కొత్తపల్లి బాబూరావు, నాయకులు జె.న్యూటన్, కూచిపూడి సత్యం మాదిగ, వేమూరి సుధీర్ మాదిగ, జస్మిన్, చిలకా కిరణ్ మాదిగ, ధనరాజుపల్లి కిషోర్ మాదిగ, కొమ్ము ఆశీర్వాదం, గాజులవర్తి సురేష్, కొక్కిలిగడ్డ మనోజ్, టి.మరియదాసు, జీవన్, గిరీష్, పవన్, శశి ప్రసంగించారు.

నిప్పుల కొలిమిలా రెంటచింతల

రెంటచింతల: తీవ్రమైన ఎండ కారణంగా రెంటచింతల నిప్పుల కొలిమిలా మారడంతో గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. శుక్రవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 44.6, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.3 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఈ ఏడాది ఇక్కడ నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. గ్రామంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండలకు ఉదయం 10గంటల నుంచే వడగాడ్పులు వీస్తుండటంతో పాటు భూమి నుంచి భగభగ సెగలతో గ్రామస్తులు హడలిపోతున్నారు.

డాక్టర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ ఎన్జీవో సంఘ నేతలు

గుంటూరు మెడికల్: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏపీఎన్జీవో హోంలో ఆయన చిత్రపటం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్ దేశం కోసం చేసిన సేవలను మరువలేనివని కొనియాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అవిరళ కృషి చేశారని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటరెడ్డి,వి.రాజశేఖర్, సంయుక్త కార్యదర్శులు కె.ఎస్.సుకుమార్, హరిబాబు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, గుంటూరు నగర అధ్యక్షులు ఎస్.పి.ఎస్.సూరి, కార్యదర్శి చింతల కళ్యాణ్ కుమార్, సునీల్ కుమార్, విజయ్ బాబు, విజయలక్ష్మి, పద్మజ, శైలజ, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సిహెచ్ అనిల్ కుమార్, అమరావతి తాలూకా కార్యదర్శి నాగేశ్వరరావు, దుగ్గిరాల తాలూకా అధ్యక్షుడు సాయిబాబు, మహిళా విభాగం చైర్‌పర్సన్లు రాధా రాణి, కేలక్ష్మీ రమ్య పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళి

నగరంపాలెం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా ఏఎస్పీ(ఏఆర్) కె.కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ (ఏఆర్) చంద్రశేఖర్‌రావు, ఆర్‌ఐలు థామస్‌రెడ్డి, రాజారావు, రాఘవయ్య, రమేష్‌కృష్ణన్ నివాళులర్పించారు.

డీఈఓ కార్యాలయంలో..

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో అసమానతలను రూపుమాపడంలో అంబేడ్కర్ విశేష కృషి చేశారని డీఈఓ పి.శైలజ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠ్యపుస్తక విభాగ మేనేజర్ వి.వజ్రబాబు, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఏఎస్పీ కోటేశ్వరరావు


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల అలంకరిస్తున్న డీఈఓ శైలజ, ఖాసీం

జెడ్పీ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్ : జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. బాబూనాయక్, పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కేజే నతానియేల్, గుంటూరుజిల్లా ఎస్ఈ బ్రహ్మయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. సురేష్, ఏపీపీఆర్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ మురళీకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి కె. సంగీతరావు, ఏపీ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు బి. రత్నప్రసాద్, జెడ్పీ సీఈవో జె. మోహన్‌రావు, వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, డీపీవో ఆర్. కేశవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రమేష్, గుల్జార్ బేగం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో కత్తెర హెనీ క్రిస్టినా, మేకతోటి సుచరిత

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా..!

- 40 మంది నుంచి డబ్బు వసూలు
- రూ.1.20 కోట్లు కాజేసిన వైనం
- పెదకాకాని పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పెదకాకాని: ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసగించిన ఘటన తాజాగా వెలుగు చూసింది. ఉద్యోగాల పేరుతో రూ.కోటీ ఇరవై లక్షలు మోసపోయారు. బాధితుల కథనం.. గుంటూరు జిల్లా పెదకాకాని పరిధిలోని కంతేరు అడ్డరోడ్డులో ఉన్న ఐజేఎం అపార్ట్‌మెంట్స్‌లో విజయవాడ ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దావులూరి మాల్యాద్రి నివాసం ఉంటున్నాడు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చింది. కాంట్రాక్ట్ పద్ధతిలో వికలాంగ పిల్లలకు విద్యాబోధన చేస్తున్న మాత జయప్రకాష్‌రెడ్డికి దావులూరి మాల్యాద్రి పరిచయం అయ్యాడు. డీఎస్సీలో మిగిలిపోయిన పోస్టులకు సంబంధించి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు.

తనకు మధ్యవర్తిగా లాజర్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు..

జయప్రకాష్‌రెడ్డి కాకినాడ జిల్లా, కాజులూరు మండలం, దుగ్గుదూరు గ్రామం కావడంతో ఆయన పరిచయం ఉన్న మరో ఏడుగురితో కలసి మొత్తం ఎనిమిది మంది లాజర్‌ను కలిశారు. ఒక్కొక్క పోస్టుకు రూ.3 లక్షల అవుతుందని ముందుగా ఒక్కొక్కరూ అడ్వాన్స్ లక్ష చొప్పున చెల్లించాలని లాజర్ చెప్పడంతో 8 లక్షలు చెల్లించారు. ఎక్కువ మందిని చూసుకోవడం ద్వారా ఖర్చులు తగ్గుతాయని చెప్పడంతో శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రైవేటు టీచర్లుగా పనిచేస్తున్న మరో 32 మందిని పరిచయం చేశారు. 40 మంది నుంచి ఫోన్ పే, గూగుల్ పే, బ్యాంక్ అకౌంట్ ద్వారా చెల్లించారు. వారి వద్ద నుంచి దావులూరి మాల్యాద్రి, లాజరు అతడి భార్య అరుణ వసూలు చేశారు. ఏ ఒక్కరికీ ఉద్యోగం రాకపోగా అదిగో ఇదిగో వస్తుంది అంటూ కాలయాపన చేస్తున్నారు. గట్టిగా నిలదీయడంతో అందరికీ ఉద్యోగాలు వచ్చే వరకూ షూరిటీగా నోట్లు, 100 స్టాంప్ పేపరుపైనా దావులూరి మాల్యాద్రి సంతకం చేసి ఇవ్వడం జరిగింది. అనంతరం కొంతకాలానికి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో మీకు ఉద్యోగాలు ఇప్పించం, చేతనైంది చేసుకోండి అంటూ దుర్భాషలాడాడు. అలానే ఉద్యోగానికి నగదు చెల్లించిన వారిలో ఒకరైన ఎం.రాజేష్ బావ బి. వెంకటేశ్వరరావు(కానిస్టేబుల్) నిన్ను నమ్మి డబ్బులు చెల్లించాం, నీ చెక్ ఇవ్వాలని మాత జయప్రకాష్‌రెడ్డి ఇంటిపైకి వచ్చి భార్య పిల్లల్ని బెదిరిస్తున్నాడు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే ఆశపడి 40 మంది అభ్యర్థులు ఒక్కొక్కరూ రూ.3 లక్షల చొప్పున చెల్లించి మోసపోయామని, మాకు మా కుటుంబసభ్యులకు ప్రాణరక్షణ కల్పించాలని, మోసపోయిన నగదు ఇప్పించాలని బాధితులు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

సౌత్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ప్రవీణ్‌కుమార్



చీరాల రూరల్: సౌత్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్ కుమార్ 96 కేజీల విభాగంలో ఎంపికయ్యారు. ఈ మేరకు ఇండియన్ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నుంచి ఆహ్వానం అందినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోటీలు ఈనెల 15న హైదరాబాద్‌లో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఈయన బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగం చేస్తున్నారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ మరోవైపు తనకిష్టమైన వెయిట్ లిఫ్టింగ్‌లో సాధన చేస్తున్నారు. గతంలో ఈయన అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాడు. పోటీలకు ఎంపికైన ప్రవీణ్‌కుమార్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ డాక్టర్ పున్నారావు, రిటైర్డు డీఎస్‌డీవో శ్రీనివాస ప్రసాద్‌లతో పాటు పలువురు క్రీడా ప్రేమికులు అభినందించారు.

భావితరాలకు దిక్సూచి బాబా సాహెబ్


కొత్తసొలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాజకుమారి తదితరులు

యడ్లపాడు: భావితరాలకు బాబాసాహెబ్ అంబేడ్కర్ దిక్సూచి అని ఏపీఎస్‌పీ డీఐజీ బి. రాజకుమారి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొత్తసొలసలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ముందుగా జై భీమ్ యూత్ సభ్యులు నీలిరంగు జెండాలతో యడ్లపాడు 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి అతిథులతో కలసి కొత్తసొలస వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని రాజకుమారి, సెబ్ సీఐ బాలయ్య దంపతులు, జై భీమ్ కమిటీ, ఇతర అతిథులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాజకుమారి మాట్లాడారు. పండితులకే పండితుడు, మహోపాధ్యాయులకే మహోపాధ్యాయుడు, చరిత్రకారుడు, విజ్ఞానం, పరిజ్ఞానం కలిగిన మేధావి, సామాజిక, ఆర్థిక, తత్వవేత్త, భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత వంటి అనేక బిరుదులు కలిగిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు లభించిన పూర్వజన్మ సుకృతం..అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రతి పల్లెలో కనిపించే అంబేడ్కర్ విగ్రహం తమ భవిష్యత్తును నిత్యం కొత్తమార్గంలో తీర్చిదిద్దుకోవాలని సూచిస్తుందని, చూపుడు వేలు చూపించడంలో ఉన్న అంతర్యాన్ని యువత గ్రహించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ దాసరి బాలయ్య, భట్టిప్రోలు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత యడ్ల సునీల్, జై భీమ్ రాష్ట్ర కార్యదర్శి పిల్లి రాజు, కాకుమాను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శీలం రవిబాబు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిశోర్, గోళ్ల అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కొప్పుల జ్యోతిరత్న బాబు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమాన్ని కొత్తసొలస జై భీమ్ సభ్యులు తాడిగిరి కిశోర్, నాగార్జున, బెజ్జం నరేంద్ర, యామర్తి రామాంజనేయులు, నల్లయ్య, బి. బాలస్వామి పర్యవేక్షించారు.

ప్రపంచ ప్రయాణికుల ఫెస్టివల్‌కు బాపట్ల జిల్లావాసి

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన దళిత యువ పారిశ్రామికవేత్త ఇత్తడి సుబ్బారావుకు ఆస్ట్రియా రాజధాని వియన్నాలో జరిగే ప్రపంచ ప్రయాణికుల ఫెస్టివల్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. కోవిడ్ సమయంలో ప్రజా రవాణా వ్యవస్థ నష్టాల బాటలో నడిచాయి. ఇప్పటికీ కోలుకోలేదు. వాటన్నింటినీ తాను చేసిన ప్రయోగంతో లాభాల బాట పట్టించవచ్చని సుబ్బారావు చెబుతున్నాడు. బస్సు, రైలు, విమానాల్లో వర్క్ ఆన్ వీల్స్ ప్రయోగం అమలు ద్వారా ఆయా వాహనాల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం వస్తుందని చెబుతున్నారు. తాను చేసిన ప్రయోగంపై ప్రపంచ ప్రయాణికుల ఫెస్టివల్‌లో ప్రజా రవాణా సంస్థలతో చర్చించే అవకాశం తనకు దక్కిందని సుబ్బారావు తెలిపారు.